# సాక్షి గుంటూరు

శనివారం, 1, జూలై, 2023






### దుర్గమ్మకు బంగారు హారం

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దురమ్మకు తాడేపల్లికి చెందిన వింద్యావర్షిణి, సాయి సహస్ర రూ.3.50 లక్షలు పెట్టి 64 గ్రాముల బంగారంతో చేయించిన మామిడి పిందెల హారాన్ని సమర్పించారు.



### అమ్మవారికి సారె

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాలలో శుక్రవారం పెద్ద ఎత్తున భక్తులు, భక్త బృందాలు అమ్మవారికి ఆషాఢ సారెను సమర్పించాయి.



### తిరుపతమ్మకు బోనాలు

పెనుగంచిప్రోలు: ఆషాఢమాసం సందర్భంగా తిరుపతమ్మను శుక్రవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు.



**వైద్య 'జ్యోతి'**

గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో నేషనల్ క్యాన్సర్ గ్రిడ్ (ఎన్‌సీజీ) ఏపీ చాప్టర్ రాష్ట్రస్థాయి వార్షిక తొలి సమావేశం శుక్రవారం జరిగింది. తొలుత జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి విడదల రజిని, ఆరోగ్యశ్రీ సీఈఓ హరీంద్రప్రసాద్, నాట్కో ట్రస్టు వైస్ చైర్మన్ నన్నపనేని సదాశివరావు, మేయర్ మనోహర్, సూపరింటెండెంట్ ప్రభావతిని చిత్రంలో చూడొచ్చు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంయుక్త ఆధ్వర్యంలో

## గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు
- ప్రామాణిక స్టడీ మెటీరియల్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (sakshieducation.com)రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్‌సీ ఎగ్జామ్స్ కలిసి జూలై 2వ తేదీ (ఆదివారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు గుంటూరు మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఎదుట ఉన్న శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్నేళ్లుగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్-2 ఉద్యోగాలు రానుండటం, దీనికి తోడు గ్రూప్-2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 89850 94499 సెల్ నంబర్‌కు తమ పేరు, సెల్ నంబరు, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపాలి.

**అవగాహన సదస్సు తేదీ:**
జూలై 2, 2023 (ఆదివారం)

**వేదిక:**
శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరం, హిందూ కళాశాల ఎదురు, మార్కెట్ సెంటర్, గుంటూరు

**సమయం:**
ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు

**వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్ : 89850 94499**

# ఉపాధ్యాయులకు వరం

**ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు పరిష్కారం**

- ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- ఇటీవలే 58 ఎంఈఓ-2ల నియామకం
- తాజాగా ఎంఈఓ-1 పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు
- జోన్-3 పరిధిలో 91 ఎంఈఓ పోస్టులు ఖాళీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయవర్గాలకు కొరకరాని కొయ్యగా మారిన ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ప్రభుత్వం చూపింది. ప్రతి మండలానికీ అదనంగా మంజూరు చేసిన ఎంఈఓ పోస్టులతో విద్యావ్యవస్థలో క్షేత్రస్థాయి పర్యవేక్షణకు పెద్దపీట వేసింది. ఈ విప్లవాత్మక నిర్ణయం ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లోని ఉపాధ్యాయులకు ఊరట నిచ్చింది. ఇటీవల ఎంఈఓ-2 పోస్టులను జెడ్పీ యాజమాన్యంలోని హెచ్‌ఎంలతో భర్తీ చేసిన ప్రభుత్వం తాజాగా ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలతో భర్తీకి చర్యలు చేపట్టింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పలు మండలాలకు ఎంఈఓలు లేరు. పక్క మండల ఎంఈఓలు ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఆ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**అతిపెద్ద సమస్యకు ముగింపు**

ఏకీకృత సర్వీసు రూల్స్ అంశం పరిష్కారానికి నోచుకోకపోవడంతో ఎంఈఓ పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేసే వీలు లేకపోయింది. దీంతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులను తెచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు పరిష్కారం చూపే ఉద్దేశంతో ఎంఈఓ-2 పోస్టును సృష్టించారు. ప్రతి మండలానికీ ఇద్దరు ఎంఈఓలను ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల నుంచి నియమించడం ద్వారా ఏకీకృత సర్వీసు రూల్స్ అంశానికి పరిష్కారం లభించింది. ఫలితంగా విద్యావ్యవస్థను పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్యకు శాశ్వత ముగింపు పలికినట్టయింది.



ఎంఈఓ02 పోస్టుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు, డీఈఓ శైలజ (ఫైల్)

### 2న గుంటూరులో కౌన్సెలింగ్

జోన్-3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మొత్తం 91 ఎంఈవో-1 పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ షెడ్యూల్ విడుదల చేసింది. జోన్-3 పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎంలతో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శుక్రవారం సీనియార్టీ జాబితా విడుదల చేశారు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లాలో 58 ఎంఈఓ-2 పోస్టులు జెడ్పీ యాజమాన్యంలోని హెచ్‌ఎంలతో భర్తీ చేయగా, తాజాగా ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్‌ఎంలతో ఎంఈవో-1 పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. సీనియార్టీ జాబితాలో ఉన్న హెచ్‌ఎంలకు ఈనెల 2వ తేదీన గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో కౌన్సెలింగ్ ద్వారా నియామకాలు పూర్తి చేయనున్నారు. కాగా జోన్-3 పరిధిలో 91 ఎంఈఓ-1 పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, గ్రేడ్-2 హెచ్‌ఎంలు 62 మంది ఉన్నారు. 2న కౌన్సెలింగ్ ద్వారా నియమితులైన ఎంఈఓలు ఈనెల 3వ తేదీన తమకు కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

### 62 మందితో సీనియార్టీ జాబితా

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జోన్-3 పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 62 మంది హెచ్‌ఎంలతో సీనియార్టీ జాబితా విడుదల చేశాం. వారికి ఆదివారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ద్వారా నియామకాలు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది.

– వీఎస్ సుబ్బారావు,
ఆర్జేడీ, గుంటూరు జోన్

### ఆమోదయోగ్యమైన నిర్ణయం



దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సఫలీకృతులయ్యారు. ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల హెచ్‌ఎంలతో ఎంఈఓ పోస్టుల భర్తీకి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. ఇరు యాజమాన్యాల్లోని ఉపాధ్యాయులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా సమర్థంగా చర్యలు చేపట్టడం అభినందనీయం.

బి. తిరుపాల్,
ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు

## రూ.50కే కిలో టమాటా

- గుంటూరు రైతు బజార్లలో పంపిణీ
- ఆధార్ కార్డు తప్పనిసరి
- పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన జేసీ రాజకుమారి



టమాటా విక్రయ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న జేసీ రాజకుమారి

కొరిటిపాడు(గుంటూరు): టమాటా ధరలు పెరగడంతో వినియోగదారులకు ఉపశమనం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. రూ.50కు కిలో టమాటా విక్రయాలను చుట్టుగుంట రైతు బజారులో శుక్రవారం రాత్రి ఆమె ప్రారంభించారు. జేసీ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటాలను తెప్పించి సబ్సిడీపై రైతుబజార్లలో విక్రయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. గుంటూరులోని చుట్టుగుంట, ఆర్టీసీ బస్టాండ్, కృష్ణనగర్, తెనాలిలోని రైతుబజార్లలో టమాటా అమ్మకాలకు మార్కెటింగ్‌శాఖ ఏర్పాట్లు చేసిందని వివరించారు. మదనపల్లి నుంచి గుంటూరుకు 5 టన్నుల టమాటాలను శుక్రవారం రాత్రి తీసుకువచ్చినట్టు చెప్పారు. మరో 3 టన్నులు శనివారం రానున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద బ్యాంకు డీసీసీబీ

**టర్నోవర్ రూ.5,442.28 కోట్లు**

- పీఏసీఎస్‌లలో రికవరీల వేగం పెంచాలి
- జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం ద్వారా విదేశీ విద్యకు రుణాలు
- జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము

**కొరిటెపాడు(గుంటూరు):** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ రూ.5,442.28 కోట్ల టర్నోవర్‌తో రాష్ట్రంలో రెండో అతి పెద్ద బ్యాంకుగా వృద్ధి చెందిందని ఆ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము తెలిపారు. రుణాల వసూళ్లను వేగవంతం చేయాలని కోరారు. బ్రాడీపేటలోని బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన బ్యాంక్ మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ పాలకవర్గం, అధికారుల సమష్టి కృషితో 2022–23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రూ.36 కోట్లు లాభాలు సాధించినట్టు వివరించారు. బ్యాంకు లాభాల నుంచి 6 శాతం డివిడెండ్‌ను అన్ని సహకార సంఘాలకు పంచనున్నట్లు వెల్లడించారు. పీఏసీఎస్‌లు రికవరీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రికవరీలు చేయని సీఈఓల జీతాలు నిలిపి వేయాలని పీఏసీఎస్‌ల అధ్యక్షులకు సూచించారు. జగనన్న సహకార విద్యాజ్యోతి పథకం కింద విదేశీ విద్యకు పెద్ద ఎత్తున రుణాలు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 78 మంది విద్యార్థులకు విదేశీ విద్య కోసం రుణాలు అందజేసినట్టు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 పీఏసీఎస్‌ల అధ్యక్షులు ఒక వాట్సప్ గ్రూపు క్రియేట్ చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షులకు గౌరవ వేతనం ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కొందరు అధికారులు అడ్డు పడుతున్నారని వెల్లడించారు. పీఏసీఎస్‌లలో నూతన స్టాఫ్ రిక్రూట్‌మెంట్‌కు యత్నిస్తున్నామని వెల్లడించారు. ముందుగా జీడీసీసీ బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి పలు తీర్మానాలు సభలో పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. బ్యాంక్ సీఈఓ టి.కృష్ణవేణి, పాకవర్గ సభ్యులు కె.హరిబాబు, వెంకటేశ్వర్లు, రామయ్య, ఆంజనేయులు, 167 పీఏసీఎస్‌ల అధ్యక్షులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ లాలుపురం రాము,

# నిరంతర ప్రక్రియలా.. గృహ నిర్మాణాలు జరగాలి

- వైఎస్సార్ జగనన్న కాలనీలకు నిధుల కొరత లేదు..
- పటిష్ట విధానాలు పాటిస్తే త్వరగా నిర్మాణాలు పూర్తి
- వివిధ శాఖల సమన్వయం తప్పనిసరి
- హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ శాఖ ఎండీ లక్ష్మీశా

**గుంటూరు వెస్ట్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగాలని హౌసింగ్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీశా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, హౌసింగ్ శాఖ జాయింట్ ఎండీ శివప్రసాద్, జేసీ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో లక్ష్మీశా గృహ నిర్మాణాలపై దిశానిర్దేశం చేశారు. గృహ నిర్మాణాలకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. బిల్లులను ఎప్పటికప్పుడు నిర్దేశించిన విధానంలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి సందిగ్ధతకు తావివ్వకూడదని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, ఇనుము, నీరు పూర్తిస్థాయిలో నిల్వ ఉంచుకోవాలని చెప్పారు.

**సీఆర్డీఏలో నిర్మాణాలకు త్వరలో శంకుస్థాపన: కలెక్టర్**

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఆర్డీఏ పరిధిలో 25 జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలకు సంబంధించి అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాలకు సంబంధించిన లబ్ధిదారులు 47 వేల మంది ఉన్నారని వెల్లడించారు. వీరికి కేటాయించిన స్థలాల్లో శంకుస్థాపనలు.. ఈ నెల 8న ప్రారంభిస్తామని చెప్పారు. నిర్మాణాలకంటే ముందు రోడ్ల అనుసంధానం, విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని కలెక్టర్ వివరించారు. నీటి వసతికి బోర్లు తవ్వించామని, అధిక శాతం లబ్ధిదారులు ఆప్షన్-3 కింద వారి అంగీకారం తెలిపారని చెప్పారు. ఈ మేరకు నిర్మాణానికి ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లతో మాట్లాడామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## 11న ఒంగోలు జాతి పశువుల వేలం

**గుంటూరు రూరల్:** పశు పరిశోధనా స్థానం లాఫాంలో 80 ఒంగోలు జాతి పశువుల వేలం ఈ నెల 11న నిర్వహించనున్నట్లు పశుపరిశోధన స్థానం ఇన్‌చార్జ్ డాక్టర్ ముత్తారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పశు పరిశోధన స్థానంలో పలు షరతులతో బహిరంగ వేలంను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం నకళ్లతో.. రూ.2 వేలు దరావత్తు కార్యాలయంలో 11న ఉదయం 9 గంటలలోపు చెల్లించి, పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

# చిట్ నిర్వాహకురాలికి మూడేళ్ల జైలు

**గుంటూరు లీగల్:** చీటింగ్ చేసిన చిట్స్ నిర్వాహకురాలు గరిక నాంచారమ్మకు మూడేళ్ల జైలు, రూ.5,500 జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. బాపట్ల పట్టణానికి చెందిన నాంచారమ్మ, ఆమె భర్త చంద్రయ్య, కుమారులు బాలు, రవి, అల్లుడు కట్టా సాంబయ్య లైసెన్స్ లేకుండా చిట్లు వేస్తుంటారు. అందులో కొందరి చిట్ కాల పరిమితి ముగిసినా.. డబ్బులు చెల్లించకుండా ఎక్కువ వడ్డీ ఇస్తామంటూ..కాలం వెళ్లదీస్తూ వచ్చారు. బాపట్ల రైలు పేటకు చెందిన దాసరి రామ్మోహనరావు ఈ మోసంపై బాపట్ల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామారావు విచారణ చేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన సీఐ ఆంజనేయులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుతం ఉన్న సీఐ కృష్ణయ్య కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు విచారణకు ముందే రెండో నిందితుడు గరిక చంద్రయ్య మరణించారు. నేరం రుజువు కావటంతో నాంచారమ్మకు మూడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన వారిపై నేరం రుజువు కాకపోవడంతో కేసు కొట్టివేశారు. ప్రాసిక్యూషన్స్ తరపున అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ సికా బెనర్జీ సాక్షులతో సాక్ష్యం నమోదు చేయించారు. ప్రస్తుతం ఉన్న పీపీ సిరాజుద్దీన్ వాదనలు వినిపించారు.

# జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమార్

- అత్యవసర వైద్య సేవలకు తొలి ప్రాధాన్యం
- ఆరోగ్యశ్రీ చికిత్సలు పెంచేలా చర్యలు



డాక్టర్ కిరణ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న డాక్టర్ ప్రభావతి

**గుంటూరు మెడికల్:** గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం విధుల్లో చేరారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నీలం ప్రభావతి పదవి విరమణ చేయడంతో డాక్టర్ కిరణ్ కుమార్‌ను ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డాక్టర్ ప్రభావతి నుంచి డాక్టర్ కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఈయన జనరల్ సర్జన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో విజయవాడ, గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేసి, తనదైన ముద్ర వేశారు.

**అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యం**

జీజీహెచ్‌లో సత్వర వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తానని డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు అధిక సంఖ్యలో జరిగేలా చూసి, ఆసుపత్రి అభివృద్ధికి వనరులు సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డాక్టర్ గోఖలే ఆధ్వర్యంలో గుండెకు బైపాస్ సర్జరీలు జీజీహెచ్‌లో చేసేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జీజీహెచ్‌లో తొలిసారిగా లివర్ ఆపరేషన్లు ప్రారంభించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు జారీ చేసిందని, త్వరలోనే ఆపరేషన్లు జరిగేలా చూస్తామన్నారు. తనపై నమ్మకంతో సూపరింటెండెంట్ పదవి అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# పాఠశాలకు ప్రింటర్, భోజన కారియర్లు వితరణ

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ



విద్యార్థులతో బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

**కొరిటెపాడు(గుంటూరు):** పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపడం పండుగలా భావించే స్థితి తీసుకువచ్చి, చరిత్రాత్మక విద్యా సంస్కరణలను ప్రవేశపెట్టిన దార్శనికుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ కొనియాడారు. పొన్నూరు మండలం, మామిళ్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్, పిల్లలకు భోజన కారియర్లను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియం, స్మార్ట్ తరగతులను ప్రవేశపెట్టి, విద్యా ప్రమాణాలను పెంచిన జగనన్న నాయకత్వంలో ఉండటం ఈ తరం చిన్నారుల అదృష్టమన్నారు. సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో తమ స్వగ్రామం మామిళ్ళపల్లిలోని పాఠశాల భివృద్ధికి బజరంగ్ ఫౌండేషన్ నుంచి సహాయ సహకారాలను అందించడం జరుగుతోందని తెలిపారు. పాఠశాలకు ప్రింటింగ్ మిషన్‌తో పాటు, 200 మంది విద్యార్థులకు భోజనం కారియర్లు బజరంగ్ ఫౌండేషన్ తరపున అందించడం జరిగిందని వెల్లడించారు. మామిళ్ళపల్లి సర్పంచ్ జాలాది యానాది రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## 34,259 బస్తాల మిర్చి విక్రయం

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు శుక్రవారం 31,118 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 34,259 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం -334, నంబరు-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,800 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాకు రూ.13,000 నుంచి రూ.23,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.14,000 నుంచి రూ.24,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 13,978 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

## నిమ్మకాయల ధరలు

**తెనాలిటౌన్:** గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.700, గరిష్ట ధర రూ.1500, మోడల్ ధర రూ.1000 వరకు పలికింది.

## మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా శ్రీనివాసరావు

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డు పర్సన్ ఇన్‌చార్జిగా మార్కెటింగ్‌శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు కాకుమాను శ్రీనివాసరావును నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గత మార్కెట్ యార్డు పాలకవర్గం పదవీ కాలం 2023 మే 24వ తేదీ నాటికి ముగిసిందని పేర్కొన్నారు. తదుపరి కొత్త పాలకవర్గం ఏర్పాటుకు ప్రతిపాదనలు ప్రభుత్వం పరిశీలనలో ఉన్నాయని తెలిపారు.

**మనం మాట్లాడుకోవాల్సిందే!**

ఆధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

# డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

### కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లి, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

### సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

### కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

### అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాజ్రా

# మరో స్వర్ణకమలం

**సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాజ్రా.**

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాజ్రా.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాజ్రా ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాజ్రా. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాజ్రా


డ్యాన్స్ క్లాస్‌లో ...

**■ దేవుని గుడిలో చూసి..**

సాజ్రా కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాజ్రాని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాజ్రా.

**■ మగవారికే కథాకళి**

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కానివ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాజ్రా.

**■ కఠిన శిక్షణ**

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాజ్రా ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాజ్రా. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

**నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.**

# పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

**తొమ్మిదేళ్లకే కాలేజీ..**

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

**ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ**

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా, నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

# ది బాస్ లేడీ

**నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...**


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

**కల కనాలి... ముందుకు కదలాలి:** ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

**అంకితభావం ప్లస్ కష్టం:** నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

**రిస్క్‌కు భయపడితే రిస్క్:** ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

**నెట్‌వర్క్:** నటనకైనా, వ్యాపారానికైనా పది మందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్ షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

**యుఎస్పీ:** 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.




ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.